


సేకరణ-సంపాదకత్వం: కాత్యాయనీ విద్మహే

తెలుగు ఆధునిక సాహిత్యప్రపంచంలో బుచ్చిబాబుగా ప్రసిద్ధులైన శివారాజువెంకట సుబ్బారావు కథా రచయిత, నవలాకర్త, నాటక, నాటికా రచయిత, వ్యాసకర్త, సాహిత్య వివేచనా తత్పరుడు, ఆత్మ కథారచయిత, కవి, చిత్రకారుడు. 1946లో వెలువడిన ఆయన ‘చివరకు మిగిలేది‘ నవలకు తెలుగు నవలా చరిత్రలో ఒక విశిష్టస్థానముంది. ఆయన 60 కథల వరకూ వ్రాశారు. ఆద్యంతాలు - మధ్య రాధ, ఉత్తమ ఇల్లాలు, ఒకే నిద్ర - ఎన్ని కలలు వంటి నాటకాలనూ, శిష్యరక్షిత, ఒమర్ ఖయ్యాం, రాయల కరుణకృత్యం లాంటి నాటికలనూ రాశారు. షేక్ స్పియర్ సాహితీ పరామర్శ చేశారు. ‘ నా అంతరంగ కథనం‘ అనే బాల్యజీవితానికి సంబంధించిన ఆత్మకథనూ, ‘నన్ను మార్చిన పుస్తకం‘ అనే తన వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసిన పుస్తక ప్రభావక శక్తి పరిచయాన్నీ రాశారు. బుచ్చిబాబు రచనల్లో ఆయన బహుముఖ సృజనాత్మక సాహిత్య వ్యక్తిత్వాన్ని వెల్లడించేవి ఆయన రాసిన కథలు. కథారచనలో సమకాలిక కథారచయితల కంటే భిన్నంగా తనదైన ధోరణినీ, శైలినీ, కథా శిల్పాన్నీ ఏర్పరచుకున్న రచయిత బుచ్చిబాబు. - ***కేతు విశ్వనాథరెడ్డి (దీపధారులు పుస్తకంలో)***

## బుచ్చిబాబు డైరీలు - సమయం, సందర్భం

**సాంఘిక, ఆర్థిక,** రాజకీయ, వైజ్ఞానిక సాహిత్య కళారంగాలలో చేసిన విశేషకృషివల్ల ప్రసిద్ధికి వచ్చిన వ్యక్తుల జీవితాలను పునర్నిర్మించి తరువాతి తరాలవాళ్ళకందించటానికి ఆయా వ్యక్తులు వ్రాసుకున్న డైరీలను - ఉత్తరాలను మించిన అధికారిక ఆధారాలు వేరేవీలేవు. ముఖ్యంగా సాహిత్య రంగంలో రచయితల వాఙ్మయ జీవిత సూచికలను సిద్ధం చేయటంలో భాగంగా వారి వాఙ్మయ జీవిత విశిష్టతలను వ్యక్తం చేసే డైరీలను - ఉత్తరాలను ప్రచురించటం ప్రయోజనకారిగా వుంటుంది.

డైరీ - దినచర్య రచన. వ్యక్తుల నిత్యజీవిత విషయాలను, కుటుంబ సంబంధాలను, స్నేహ సంబంధాలను, వృత్తిపర విషయాలను మాత్రమే కాక వాళ్ళ అభిరుచులను, అభిప్రాయాలను, కాంక్షలను, ఆంతర్యాలను, అలవాట్లను, ప్రవర్తనారీతులను, ఆశాభంగాలను పట్టి చూపించేది డైరీ. డైరీ వ్రాయటం అంటే వ్యక్తులు తమ అంతరంగాన్ని తామే తమముందు పరిశీలనకు పెట్టుకోవడమన్నమాట. ఏ

దాపరికాలు, భయాలు, వంచనలు లేకుండా అంతరంగాలను విప్పిపరచే వీలుండటం వల్ల డైరీలు చాలావరకు రచయిత అసలైన వ్యక్తిత్వానికి నిలువుటద్దాలుగా ఉంటాయి.

డైరీలు - ఉత్తరాలు ఆ వ్యక్తులకు సంబంధించిన విస్తృత సమాచారాన్నందిస్తాయి. ఈ విస్తృత సమాచారం తత్కాలంలో దానంతటఅదిగా సాధించే ప్రయోజనం పెద్దగా వుండకపోవచ్చు. కానీ తరువాత తరువాత ఆ వ్యక్తులను చుట్టుకుని జరిగే పరిశోధనలకు ముడిపదార్థంగా పనిచేస్తూ మార్గదర్శక సూత్రాలను నిర్దేశించగల స్థితిలో వుంటుందనటంలో సందేహంలేదు. ఈ సందర్భంలో డైరీలను - ఉత్తరాలను చెత్తకింద తీసిపారేసిన వాళ్ళున్నప్పటికి అలాంటి వాటి ఆధారంతోనే వర్జీనియావుల్ఫ్ వంటి రచయితలు చక్కని జీవిత చరిత్రలను రూపొందించిన విషయం గమనించవచ్చు.

ఈ క్రమంలో సామాజిక సాహిత్య రంగాలలోని మనుషుల డైరీలకు మరింత ప్రాధాన్యత ఉంది. సమకాలీన సామాజిక రాజకీయాంశాల పట్ల రచయిత ప్రతిస్పందనా స్థాయిని, చైతన్యాన్ని, రచయిత సాహిత్య దృక్పథం రూపొందుతున్న క్రమాన్ని అర్థం చేసుకొనటానికి ఈ విధంగా డైరీలు వల్ల లభించే విస్తృత సమాచారం తోడ్పడుతుంది. అసలు సాహిత్యరంగంలో డైరీలను ఉత్తరాలను సేకరించి అధ్యయనానికి వీలుగా సంపాదించి ప్రచురించటం పాశ్చాత్య భాషాసాహిత్యాలననుసరించి వచ్చిన సంప్రదాయమే. 1857 తరువాత తెలుగు సాహిత్యంలో వచ్చిన నూతన పరిణామం ఫలితమిది. ఈ క్రమంలో గురజాడ అప్పారావుగారి డైరీలు - లేఖలు, కందుకూరి వీరేశలింగం పంతులుగారి డైరీలు - లేఖలు, విశ్వనాథ సత్యనారాయణగారి డైరీలు - లేఖలు ప్రచురించబడ్డాయి. 2007లో మనసు ఫౌండేషన్ ప్రచురించిన 'రాచకొండ విశ్వనాథశాస్త్రి రచనా సాగరం' పుస్తకంలో 1935 నుండి 1941 వరకు లభించిన రావిశాస్త్రి డైరీలు చేర్చబడ్డాయి

ఆధునిక కాలంలో తెలుగుభాషా సాహిత్య రంగాలలో డైరీలను - ఉత్తరాలను సంపాదించి, ప్రచురించి అధ్యయనావకాశాలను విస్తృతం చెయ్యాలన్న దృక్పథం రోజురోజుకీ బలపడుతున్నది. ఈనాడు  అటు రచయితలు - ఇటు విమర్శకులు రచయితల డైరీలను, ఉత్తరాలను బయటపెట్టటం ద్వారా ఆయా రచయితల రచనల గురించి కొత్త కొత్త విషయాలను తెలుసుకోవటం ఎట్లా వీలవుతుందో చెప్తున్నారు.

నిజానికి బుచ్చిబాబు డైరీలను 1983 లోనే బుచ్చిబాబు వాఙ్మయ జీవిత సూచికలో భాగంగా అచ్చువేయటం జరిగింది . 1978-1983 మధ్యకాలంలో చివరకు మిగిలేది నవల మీద పిహెచ్‌డి కి పరిశోధన చేస్తూ బుచ్చిబాబు సాహిత్య వ్యక్తిత్వాన్ని దృక్పథాన్ని అర్థం చేసుకొనటానికి ఆయన సమస్త సాహిత్యాన్ని సేకరిస్తూ అధ్యయనం చేస్తున్న ఆరోజుల తపనను తీర్చిన సాహిత్యంలో బుచ్చిబాబు డైరీలు, ఉత్తరాలు ప్రధానమైనవి. బుచ్చిబాబుగారి భార్య శివరాజు సుబ్బలక్ష్మి గారు విశాల హృదయంతో అవి అన్నీ చూడటానికి నాకు అవకాశం ఇచ్చారు.  1980 మేలో వారం రోజులు, జూన్‌లో వారం రోజులు, జులైలో వారం రోజులు - 1981 జులైలో మరో వారం రోజులు హైదరాబాదులో వారింట్లోనే వుండి డైరీల పని చూసుకోవటం జరిగింది. యింకా మిగిలివున్న డైరీలను నాతోపాటు వరంగల్‌కు తీసుకొచ్చుకోవటానికి సుబ్బలక్ష్మిగారంగీకరించటంతో - తెచ్చుకున్న డైరీలపని 1981 సెప్టెంబర్‌లో కొంత, 1982 జనవరిలో మరికొంత చేసుకోగలిగాను. 1982 మార్చిలో మళ్ళీ ఒకసారి హైదరాబాదు వెళ్ళి మూడు రోజులుండి డైరీల పని పూర్తిచేసుకుని వచ్చాను.

బుచ్చిబాబు వ్రాసుకున్న డైరీలు మొత్తం 18 లభించాయి. వాటిలో మొదటిది 1935 సంవత్సరపు డైరీ. ఆ తరువాత నాలుగు సంవత్సరాల డైరీలు లేవు. 1940 సంవత్సరపు డైరీ ఉంది. ఆ తరువాత ఆరు సంవత్సరాల డైరీలు లేవు. మళ్ళీ 1947-48 సంవత్సరపు డైరీలు వున్నాయి. 1949 సంవత్సరపు డైరీలేదు. 1950 డైరీ వుంది. 1951 డైరీ లేదు. 1952 డైరీ ఉన్నది. తరువాత రెండు సంవత్సరాల డైరీలు లేవు. 1955, 1956 సంవత్సరపు డైరీలున్నాయి కానీ 1957 డైరీలేదు. 1958 నుండి 1967 వరకు మొత్తం పది డైరీలు వరుసగా

ఉన్నాయి. దొరికిన మొదటి డైరీ అంతముందునుండే ఆయన డైరీలు వ్రాయటం ప్రారంభించి వుండటానికి వీలుంది. 1967లో మరణించే వరకు ఆయన డైరీ వ్రాశాడు. అయితే మధ్యలో ఆయా సంవత్సరాల డైరీలు దొరకకుండా పోయినవి 15. వీటిని గురించి శ్రీమతి సుబ్బలక్ష్మిగారు కూడా ఏమీ చెప్పలేకపోయారు. ముఖ్యంగా బుచ్చిబాబు నవలా వస్తువును గురించి ఆలోచించే సమయంలోని డైరీలు దొరకక పోవటం వలన ఆ నవల గురించి తెలియవలసిన రచయిత అంతరంగం వెలుగులోకి రాకుండా పోయింది.

దొరికినంతవరకు డైరీలలో కొన్నిరోజులు అసలేమీ వ్రాయబడలేదు. మరికొన్ని రోజులలో ఎత్తివ్రాసి చూపించదగినంత ముఖ్యవిషయాలు కనిపించవు. అలాంటివాటినన్నింటిని వదిలివేయటం జరిగింది. ఆయన దినచర్యలన్నీ కూడా యధాతధంగా ఎత్తివ్రాయలేదు. వాఙ్మయ జీవిత విశేషాలయిన రచనలు చేయటాన్ని గురించిన వివరాలను, వాటికి సంబంధించిన ఆదాయాలను, చేసిన ఉపన్యాసాలను, సమకాలీన సాహిత్యం, సినిమా మొదలైన కళారూపాలను గురించిన అభిప్రాయాలను, సమకాలీన రచయితలతో వున్న సంబంధ బాంధవ్యాలను దృష్టిలో వుంచుకుని బుచ్చిబాబు డైరీలలోని విషయాలను ఎత్తి వ్రాయటం జరిగింది. ఆ మేరకు బుచ్చిబాబు డైరీలు నా దృష్టి కోణం నుండి ,సాహిత్య సాంస్కృతిక ప్రయోజనాల కోణం నుండి కొంత సెన్సార్ అయినవనే చెప్పాలి.

బుచ్చిబాబు డైరీలు 1935 నుండి లభిస్తున్నాయి. అప్పటికి ఆయనకు 20 సంవత్సరాలు. ఇంటర్మీడియట్ చదువు పూర్తయింది. రచయితగా, చిత్రకారుడుగా, నాటక అభిమానిగా సాహిత్య అధ్యయన పరుడుగా ఆయన రూపొందుతున్న కాలం అది. ఆ కాలంలోనే ఆయన దినచర్య రచన ప్రారంభించారు.. ఇంగ్లీష్ భాషా సాహిత్యాల పట్ల ఆయనలో ప్రత్యేక అభినివేశం బలపడుతున్న కాలం కూడా అది. తరువాత ఆయన ఇంగ్లీష్ సబ్జెక్ట్‌తో బియ్యే చెయ్యటమే కాక ఇంగ్లీష్ ఎమ్మే కూడా చేసారు. అందువల్లనే కావచ్చు ఆయన డైరీలు చాలా వరకు ఇంగ్లీష్‌లోనే ఉన్నాయి. వాటిని ఎడిట్ చేస్తూ ఎత్తి రాసుకొంటున్నప్పుడు నేను ఇంగ్లీష్‌లోనే రాసుకొన్నాను. బుచ్చిబాబు చిత్రకారుడు కూడా కనుక డైరీలలో చాలా వాటికి స్వయంగా చిత్రించి వేసుకొన్న కవరు పేజీలు ఉన్నాయి.

ఈ డైరీలు బుచ్చిబాబు లేఖలే కాక ఆయనకు ఇతర సాహిత్యకారులు రాసిన లేఖలుతో సహా 'బుచ్చిబాబు వాఙ్మయ సూచిక' ను రూపొందించి నా సిద్ధాంత వ్యాసం 'చివరకు మిగిలేది:మానసిక సామాజిక స్రవంతి- నవలా విమర్శ' కు అనుబంధంగా ప్రచురించి ఇప్పటికి 32 ఏళ్ళు. 2015(జూన్ 14)-2016 బుచ్చిబాబు శత జయంతి సంవత్సరం. కొత్తతరాన్ని బుచ్చిబాబు సాహిత్య అధ్యయనం వైపు ప్రేరేపించటానికి బుచ్చిబాబు డైరీలు ప్రచురించటం అవసరమని అదెలా ఆచరణ సాధ్యం చెయ్యాలా అని ఆలోచిస్తున్న తరుణంలో 2015 జూన్ 14న అమెరికాలో వీక్షణం నెలవారీ సదస్సులో నేను పాల్గొనటం జరిగింది. కిరణ్‌ప్రభ గారి ఇంట్లో జరిగిన ఆ సదస్సులో బుచ్చిబాబు సాహిత్యం గురించి మాట్లాడే అవకాశం నాకు లభించింది. ఆ సందర్భంలో సాగిన సంభాషణ ఫలితం బుచ్చిబాబు డైరీలను కౌముదిలో సీరియల్‌గా ప్రచురించటానికి కిరణ్‌ప్రభగారు ఇష్టంగా ముందుకు రావటం. కొత్తతరం పాఠకులకు కొత్త పద్ధతిలో బుచ్చిబాబును చేరువ చెయ్యటం మంచిదే కదా అని నేను 'సరే' అన్నాను. ఇంగ్లీష్‌లో ఉన్న డైరీలను తెలుగు చేసి వేద్దామని కూడా ఆయనే అన్నారు. బుచ్చిబాబు డైరీల ప్రచురణకు సమయం సందర్భం ఇలా సమకూడాయి. ఈ నాడు ఇందుకు అవకాశం కల్పించిన కౌముది నిర్వాహకులు కిరణ్‌ప్రభ గారితో పాటు, ఆనాడు ఈ పనిలో ప్రేరణ అయిన బంగోరె (బండిగోపాలరెడ్డి )గారు ఈ పని ఇంత సమగ్రంగా చేయటానికి పూర్తి సహాయ సహకారాలు అందించిన శివరాజు సుబ్బలక్ష్మి గారు - నాకెప్పుడూ స్మరణీయులు.

- కాత్యాయనీ విద్మహే

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

# ముఖాముఖీలు

**రచయితలను గానీ,** రచయితల సంబంధీకులను గానీ, సన్నిహితులనుగానీ ముఖాముఖి కలుసుకోవటం, ఆ రచయితల గురించి, ఆ రచనల గురించి తెలుసుకునే ప్రయత్నం చేయటం. ఇది భాషా సాహిత్య పరిశోధనా రంగంలో వచ్చిన కొత్తపరిణామం. వర్తమాన సమకాలీన రచయితల విషయంలోను, రచనల విషయంలోను మాత్రమే ఈ పద్ధతి పరిశోధనా విధానం పనిచేస్తుంది. సామాజిక శాస్త్రవేత్తలు ప్రశ్నావళులు తయారుచేసుకుని వ్యవసాయార్థిక రాజకీయ పాలనారంగాలలోని ప్రజల నుండి సమాధానాలు రాబట్టేందుకు వెళ్ళి చేసే ఫీల్డు వర్కులాంటిది. అయితే దానికీ దీనికీ చాలా తేడావుంది. ఒకేరకమైన ప్రశ్నలు వందమందికో రెండువందల మందికో యిచ్చి రాబట్టిన సమాధానాలను శాంపుల్‌గా స్వీకరించి చేసే పరిశోధన అది. రచయితల గురించి, రచనల గురించి మనం వెళ్ళేది శాంపుల్ సర్వేకి మాత్రం కాదు. ఆయా రచయితలతో సన్నిహిత పరిచయం వుండి ఆ రచయితల ప్రత్యేక వ్యక్తిత్వంతో తాము ప్రభావితులయిన – లేక రచయిత వ్యక్తిత్వాన్ని తాము ప్రభావితం చేసిన వ్యక్తుల దగ్గరకు మనం వెడతాం. వీళ్ళ సంఖ్య పదులకు మించి ఉండదు. అందువలన భాషా సాహిత్యరంగాలకు సంబంధించి నిర్దిష్టమైన ప్రశ్నావళి సిద్ధం చేసుకుని పరిశోధనకుపక్రమించటం అంత ఫలవంతంగా ఉండదనిపిస్తుంది.

ఈ కారణం వల్లనే బుచ్చిబాబు గురించి తెలుసుకోవటానికి కలుసుకున్న పదిమంది వ్యక్తుల దగ్గరా నేను ఆయా సందర్భాలకనుగుణగా రకరకాల ప్రశ్నలు వేశాను కానీ, ఆ ప్రశ్నలను మినహాయించి వారివారి మాటలను సాధ్యమైనంత వరకు యధాతథంగా ఇందులో రికార్డు చేశాను.

వ్యక్తిగా, రచయితగా బుచ్చిబాబు గురించి తెలుసుకోవటానికి ముందుగా ఆయన భార్య శ్రీమతి శివరాజు సుబ్బలక్ష్మిగారిని కలవటం ఉపయోగకరంగా ఉంటుందని చెప్పి శ్రీ మొదలి నాగభూషణ శర్మగారు, నన్నావిడ దగ్గరకు తీసుకువెళ్ళి పరిచయం చేశారు. తరువాత సుబ్బలక్ష్మిగారు నన్ను తమ మనిషిగా చేసుకుని బుచ్చిబాబు గురించి ఎన్నో విషయాలు తెలియచేశారు. హైదరాబాదులో ఉన్న సుబ్బలక్ష్మిగారి దగ్గరకు వెళ్ళేలోపులే వరంగల్లులో మహీధర రామ్మోహనరావుగారిని కలుసుకోవటం జరిగింది. అప్పుడాయన బుచ్చిబాబు గురించి చివరకు మిగిలేది గురించి నాలుగు మాట్లలు మాట్లాడారు. అదే బుచ్చిబాబు గురించి నేను చేసిన మొదటి ఇంటర్వ్యూ.

ఉత్తరాల పని, డైరీల పని చూకుంటూ సుబ్బలక్ష్మిగారింట్లో ఉన్నప్పుడు అప్పుడప్పుడు మా మధ్య జరిగిన సంభాషణలనన్నింటిని కలిపి విషయప్రాధాన్యాన్ని బట్టి రెండు ఇంటర్వ్యూలుగా వ్రాశాను. మొదటిది వారిరువైపుల వారి కుటుంబాలకు, అలవాట్లకు సంబంధించినది. రెండవది బుచ్చిబాబు దంపతులకు విశ్వనాధాది రచయితల్తో ఏరపడ్డ పరిచయాలకు, సాన్నిహిత్యానికి సంబంధించినది.

1980 జులై 6న హైదరాబాదులో కలిసినప్పుడు బంగోరె, ఆచంట జానకిరాం గారి గురించి బుచ్చిబాబుకు ఆప్తుదని చెప్పి ఆయననను సాధ్యమైనంత త్వరలో కలిసి మాట్లాడమనీ తనతో తరువాత తీరికగా మాట్లాడవచ్చనీ చెప్పారు. ఈ లోగా మధుబాబు పేరుతో బుచ్చిబాబుకు ఉత్తరాలు వ్రాసింది వడ్డెర చండీదాసని ఆయన తిరుపతి యూనివర్సిటీ ఫిలాసఫీ డిపార్టుమెంటులో ఉపన్యాసకులుగా ఉంటున్నారని తెలిసింది. దానితో అక్టోబరులో తిరుపతి వెళ్ళి 27, 28 తారీకులలో చండీదాసుగారినీ, 28 సాయంత్రం ఆచంట జానకిరాం గారినీ కలిసి మాట్లాడాను. బుచ్చిబాబు గురించి ఆయన రచనల గురించి వారిరువురూ వెలిబుచ్చిన అభిప్రాయాలను యధాతథంగా విడివిడిగా వ్రాశాను.

బుచ్చిబాబు రేడియో ఉద్యోగి కనుక, మరణించే నాటికి ఆయన హైదరాబాదు రేడియో స్టేషన్‌లో ఉన్నారు కనుక అక్కడికి వెడితే బుచ్చిబాబు గురించి ఇంకా ఏమైనా వివరాలు తెలుస్తాయేమోనని 21-7-1981న అక్కడికి వెళ్ళాను. రావూరి భరద్వాజ గారిని కలిసి మాట్లాడాను. ఆయన సూచన మీద అదే రోజు రేడియో స్టేషనులో శ్రీమతి దయావంతిగారిని, శ్రీ.కె. పాపయ్య లింగంగారిని కలిసి మాట్లాడాను. ఈ ముగ్గురితో మాట్లాడిన అంశాలను మూడు ఇంటర్వ్యూల క్రింద రికార్డు చేసి పెట్టాను.

రావూరి భరద్వాజగారు పరిచయం చెయ్యగా 22-7-1981న పాలగుమ్మి విశ్వనాధంగారిని కలిసి ఆయనతో మాట్లాడి ఆ విషయాలనన్నింటిని ఒక ఇంటర్వ్యూగా వ్రాశాను.

21-7-1981నాడే డి. రామలింగంగారిని వారి ఆఫీసులో కలిసి మాట్లాడితే ఆదివారంనాడు యింట్లో తనకు వివరంగా మాట్లాడటానికి వీలుగా ఉంటుందని రమ్మని చెప్పారు. ఆ చెప్పిన దానిమీద వారింటికి వెళ్ళటం 14-3-1982 నాటికి కుదిరింది. బుచ్చిబాబు గురించి చాలాసేపు ఆయన మాట్లాడిన అంశాలనన్నింటినీ కలిపి వ్రాసినది ఇందులో చివరి ఇంటర్వ్యూ –

తరువాత తనకు తీరికగా కలుసుకుని మాట్లాడవచ్చన్న బంగొరె బుచ్చిబాబును గురించిన తన జ్ఞాపకాలు గత జన్మవని యిప్పుడాయనను గురించి కార్చటానికి తన దగ్గర కన్నీళ్ళు కూడా లేవనీ ఉత్తరాలలో వ్రాస్తూ వచ్చారు. అయినాసరే ఆయనను కలిసి మాట్లాడి ఆ గత జన్మ జ్ఞాపకాల పరిమళాలు ఎలాంటివో తెలుసుకుందామన్న సంకల్పంతో చేసిన రెండు మూడు ప్రయత్నాలు ఆయన బ్రతికుండగా కలిసి రాలేదు.

పాలగుమ్మి విశ్వనాధం గారితో సంభాషణలో పాలగుమ్మి పద్మరాజు బుచ్చిబాబుకు చాలా దగ్గర స్నేహితుడని తెలిసింది. పేరెన్నికగన్న కథకుడయిన పద్మరాజుగారికి బుచ్చిబాబుపైనున్న అభిప్రాయం, వారిరువురి స్నేహ లక్షణం తెలుసుకోవలసిన అవసరము, తెలుసుకోవాలన్న కోరికా ఉన్నా వారుండగా అవకాశం కలిసి రాక పద్మరాజుగారిని కలిసి మాట్లాడలేకపోయాను.

*శ్రీమతి శివరాజు సుబ్బలక్ష్మిగారితో ముఖాముఖి*
*20-4-1980& 10-7-1980, 17-7-1980*

**మా వారు** పుట్టింది ఏలూరు. అది వాళ్ళ తాతగారి ఊరు. ఆయనపేరు పెమ్మరాజు సుబ్బారాయుడుగారు. సుబ్బారావుగారి తండ్రి ప్రకాశరావుగారు. తల్లి వెంకాయమ్మ. వీరిది మధిర దగ్గర మడిపల్లె. ప్రకాశరావుగారి తండ్రి లక్ష్మీనారాయణ. తల్లి సుబ్బమ్మగారు. ఈవిడిది రాజమండ్రి దగ్గర వేల్చేరు. ఈమెతో వివాహమయ్యాక లక్ష్మీనారాయణగారు తాలూకా ఆఫీసులో గుమాస్తాగా పనిచేస్తూ రాజమండ్రి చుట్టుపక్కల ఊళ్ళల్లో తిరుగుతూ ఉండేవారు. మా మామగారు కాక వీళ్ళకు ఆయనకంటే పెద్దకొడుకు ఒకరున్నారు. ఆయన పేరు రామారావుగారు. మా పెదమామగారు L.M.S డాక్టరు. మా మామగారు వోనర్స్ కోర్సు చదివి పిడబ్ల్యుడిలో సెక్షన్ ఆఫీసరుగా పనిచేస్తుండేవారు. మా మామగారికి మళ్ళీ మావారు, మా బావగారు –ఇద్దరే కొడుకులు. మా బావగారు అగ్రికల్చరల్ బియస్సీ చదివారు 1914లో పుట్టారు. 1958లో పోయారు.

మా వారి చదువు కంకిపాడు, బాపట్ల, పెరవలి – ఈ మొదలైన చోట్ల సాగింది. స్కూలు ఫైనలు చదువు పాలకొల్లులో. స్కూలు ఫైనలు పరీక్షలు యివ్వటానికి ముందు ఓ రెండు మూడేళ్ళు మద్రాసులో వాళ్ళ పెత్తల్లి కొడుకు సత్తిరాజు వేణు గోపాలరావు గారింట్లో వుండి చదువుకున్నారు. గుంటూరు ఏ.సి కాలేజ్‌లో ఇంటరు, బియ్యే చదివారు.

మాది రాజమండ్రి దగ్గర యిప్పనపాడు. మా నాన్న ద్రోణంరాజు సూర్యప్రకాశం. మా అమ్మపేరు సత్యవతి. మేము ముగ్గురం అక్కచెల్లెళ్ళం. నేను రెండోదాన్ని. మాకు తమ్ముళ్ళు ముగ్గురు.

మా నాన్నగారు బియ్యే చదివి కూడా కాంగ్రెసులో తిరుగుతూ ఉద్యోగం చేయలేదు. ఊళ్ళో బడి పెట్టి వయోజనులకు చదువు చెప్పటం, కరణీకం చెయ్యటం ఉండేది. అప్పటికి మా మావగారు బదిలీ అయి రామచంద్రాపురం వచ్చి ఉన్నారు. మేడుపాడులాకుల సూపరెండెంటు బంగారయ్యగారని ఉన్నారు. ఆయనకు మా కుటుంబం గురించి బాగా తెలుసు. ఆయన మా మామగారి దగ్గరకు వెళ్ళి మా గురించి చెప్పి ఒకరోజు ఉన్నట్టుండి మాకు చెప్పకుండానే మా బావగారిని, మా మామగారిని, ఈయననూ తీసుకుని వచ్చారు. అప్పటికే మా యింట్లో కాఫీలు ప్రవేశించాయి. ఇక వచ్చిన వాళ్ళకు కాఫీలు అవి ఏర్పాటు చేశారు. నేను అప్పటికి వయొలిన్, హార్మణి నేర్చుకుంటుండేదాన్ని. నన్ను పాట కూడా పాడమన్నారు. సీతాపతే.... అనుకుంటా, పాడాను. గ్లాస్కో ఎంబ్రాయిడరీ పరికిణీ, శేలం పవిట కండువా, జడగంటలతో పెళ్ళిచూపులకు కూర్చున్నాను. మధ్యలో మా బావగారు లోపలికి వెళ్ళి వక్కపొడి పట్రమ్మన్నారు. కాలొంకర ఉందేమో చూద్దామని కాబోసు. నేను లోపలికెళ్ళి మళ్ళీ వెళ్ళను వక్కపొడి తమ్ముడికిచ్చి పంపించమన్నాను. తప్పమ్మా

నీవే వెళ్ళాలని మా అమ్మ నన్నే పంపించింది. ఆ రోజే సంబంధం నచ్చింది చేసుకుంటామని చెప్పి వెళ్ళిపోయారు వాళ్ళు. ఆ తరువాత రెండు రోజులలో ఏమో మా మామగారి తల్లి వచ్చి చూసి వెళ్ళారు. మా అత్తగారు రానే లేదు. ఆవిడ అప్పుడు మా బావగారి దగ్గర అంటే అమరావతి దగ్గర అగ్రికల్చర్ ఫారంలో ఉండేవారు. ఇక పెళ్ళికి ముహూర్తాలు పెట్టుకున్నారు. 1937 డిసెంబరు 23న పెళ్ళి. పెళ్ళికి అందరూ తరలి వచ్చారు. నేను బాగా లేనని మా తోడికోడలు అందిట. మా గోపాలం బావగారు అంటే వీరి పెత్తండ్రి కొడుకు నేనంటే ముందునుంచి అభిమానంగా ఉండేవారు. ఆయన జోక్యం చేసుకుని వంక పెట్టిన వాళ్ళకన్నా ఆ పిల్ల బాగుందిలే అన్నారట. మా  తోటికోడలు పెద్ద రభసట. ఆవిడ్ని సముదాయించి ఎలాగయితేనేం ఆవడలతో మీగడలతో పెళ్ళిచేశారు.

ఆ తరువాత నాలుగయిదు నెలలు అటూ యిటూ రాకపోకలు జరిగాయి. పెళ్ళయిన ఆరునెలలకు మా అమ్మ పోయింది. అది నాకొక పెద్ద షాక్. ఆ తరువాత నేను కొన్ని రోజులు అత్తిలిలో సుబ్బమ్మగారి దగ్గర ఉన్నాను. ఆవిడ మావారి నాయనమ్మ. ఆవిడ దగ్గరే నేను భాగవతాదులు చదవటం అలవాటు చేసుకున్నాను.

మా యింట్లో ముందునుండి అందరికీ చదివే అలవాటుంది. మా మామగారింట్లో ఆ అలవాటు ఎవరికీ లేదు – ఒక్క వీరి నాయనమ్మగారికి తప్ప. ఆవిడ పురాణాలు అవీ బాగా చదివేది చక్కగా అర్థం చెప్పేది. ఆవిడ దగ్గర ఉన్నప్పుడు నేను ఏ భారతమో, భాగవతమో పైకి చదవటం, ఆమె అర్థం చెప్పటం జరిగేది.

వీళ్ళింట్లో అందరికీ పేకాట పిచ్చి ఉండేది. మా అత్తగారూ వాళ్ళంతా కూడా ఆడుతుండేవారు. వీరి నాయనమ్మ కూడా పేకాట ఆడేది. నేనావిడ దగ్గర ఉన్నప్పుడు సాయంత్రం ఏడయినప్పటినుండి ఒక్క ఆటవేద్దామే అమ్మాయి అంటుండేది. రాత్రి పదయినా పదకొండయినా వదిలేదు కాదు. ఆ రకంగా నాక్కూడా పేకాట వచ్చేసింది. మా పుట్టింట్లో మేమంతా చెస్ ఆడేవాళ్ళం. మా నాన్నగారు చాలా బాగ ఆడేవాళ్ళు. మా పెళ్ళయ్యాకే ఈయన కూడా నావల్ల చెస్ నేర్చుకున్నారు. మా పుట్టింటికి వెళ్ళినప్పుడల్లా ఆయనా మా నాన్న చెస్ ఆడుతుండేవాళ్ళు.

తరువాత మా వారు ఎమ్మే చదువుకోసం మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో చేరారు. మొదటి సంవత్సరం హాస్టలులో ఉన్నారు. రెండో సంవత్సరం వాళ్ళ అన్నగారు వేణుగోపాలరావుగారింట్లో ఉండేవారు. గోపాలంగారు అప్పుడే మా నాన్నకు ఉత్తరం వ్రాశారు. పిల్లను తీసుకొచ్చి కాపరం పెట్టించమని. మా నాన్నగారు మద్రాసు బయలుదేరారు నన్ను తీసుకుని వేరే యిల్లు అద్దెకు తీసుకుని కాపురం పెట్టించి వెళ్ళారు. మూడు నాలుగు నెలలున్నాం అక్కడ. ఎమ్మే కావటంతో మద్రాసు నుండి వచ్చేశాం. పరీక్షలో ఈయనకు క్లాసు రాలేదు. నాగపూర్ యూనివర్సిటీనుండి మళ్ళీ ఎమ్మే పరీక్షకు కూర్చుని క్లాసు తెచ్చుకున్నారు. 1943లో అనంతపురం కాలేజీకి లెక్చరరుగా వచ్చారు. అనంతపురంలో ఉండగానే మద్రాసు యూనివర్సిటీ నుండి పిహెచ్.డి చేయాలని పని ప్రారంభించారుగాని యూనివర్సిటీ అందుకు పర్మిషనివ్వలేదు.

అనంతపురంలో చిలుకూరు నారాయణరావుగారింట్లో కొన్నాళ్ళున్నాం. పప్పూరి రామాచార్యులుగారి కుటుంబంతో మంచి పరిచయముండేది. 1944లో విశాఖపట్టణం కాలేజీ లెక్చరరుగా వెళ్ళారు. 1945 జూన్‌లో AIRలో ఉద్యోగం వచ్చేవరకు అక్కడే ఉన్నారు. AIR ఉద్యోగంలో మొదట మద్రాసు వెళ్ళారు. 1948 డిసెంబరులో అక్కడ్నించి విజయవాడకు వచ్చారు. 1956 వరకు అక్కడే వుండి హైదరాబాదుకు వచ్చారు.1960లో పూనాకు వెళ్ళి 1962లో మళ్ళీ బెజవాడ వచ్చారు. మూడేళ్ళు అక్కడ పనిచేసి 1965లో హైదరాబాదు వచ్చారు.

చివరకు మిగిలేది నవల వచ్చిన కొత్తల్లోనే వేలూరి శివరామశాస్త్రిగారు ఈ నవల బాగుందని వ్రాశారు. ఆయన గ్రాంధిక భాషలో వ్రాసేవాడు కదా.. అయినా ఈ నవలలో భాష, కథ అన్నీ బాగున్నాయని వ్రాశాడు. ఈ నవల మీద వచ్చిన వ్యాసాల్లో ఇది మంచి వ్యాసం. నోరి నరసింహ శాస్త్రిగారు మాత్రం ఈ నవల బాగోలేదని వ్రాశాడు ఆయన వల్లనే  ఈ నవలకు రావాల్సిన ప్రైజు రాకుండా పోయింది.

కాత్యాయని సంతతి చాప్టరు వ్రాయటానికి ఆయన ఎన్నో పుస్తకాలు చదివారు. అప్పట్లో రాయలసీమలో రెండు మూడు వజ్రాలు దొరికాయి. అన్నీ బ్రిటీషువాళ్ళే పట్టుకెళ్ళారు.

మొదట ప్రచురించబడ్డ 'చివరకుమిగిలేది ' ఎడిషనుకు ముఖచిత్రం ఆయనే గీశారు.

ఎంత చదివినా, ఎన్ని వ్రాసినా ఆయన చాలా అమాయకులు. మీరు వ్రాసింది బాగుంది అని ఎవరైనా అంటే ఉబ్బిపోయేవారు.

5-7-1980

ఈయన మద్రాసు రేడియోలో పనిచేస్తున్న రోజులవి. అప్పట్లో మద్రాసు రేడియో స్టేషన్‌లో బ్రాడ్‌కాస్ట్ చెయ్యటమే ఉండేది. రికార్డింగ్ ఉండేదికాదు. రేడియోలో ఆదివారం మధ్యాహ్నం సినిమా ఉంటే ఈయన ముందురోజే జెమినీ స్టూడియోకి వెళ్ళేవారు. అప్పుడు వాళ్ళదే పెద్ద స్టూడియో. అక్కడ సినిమా ప్రొజక్టర్‌తో వేసేవాళ్ళు. అక్కడినుండి రేడియోకి సౌండ్ కనెక్షనిచ్చేవారు. ముందురోజు వెళ్ళినప్పుడు మూడుగంటల సినిమా గంటకో గంటన్నరకో ఎడిట్ చేసేవాళ్ళు.

1947లో స్వతంత్రం వచ్చాక విశ్వనాథ సత్యనారాయణగారిని ఒక కవి సమ్మేళనం కోసం మద్రాసు రేడియో స్టేషన్‌కు పిలిపించారు. అప్పుడు ఆయన మా యింటికి కూడా వచ్చారు. అప్పుడాయన ఒక తమాషా ఉదంతం చెప్పారు.' ఆయన హోటల్‌కు వెళ్ళారట. రేషనని రెండు కప్పుల అన్నం మాత్రమే పెట్టారట. ఇంకాస్త పెట్టవయ్యా డబ్బులు కూడా ఇస్తాను' అన్నారట విశ్వనాథంగారు.

' రేషనండి కుదరదు అన్నాట్ట సర్వర్..'

' రేషనా.. అయితే దేనికి రేషన్‌లేదు' అని అడిగారట విశ్వనాధంగారు.

' సాంబారుకి' అన్నాడట సర్వర్...

ఆయనకి ఒళ్ళుమండి 'అయితే అదే పట్రమ్మన్నాడట. బక్కెట్టెడు సాంబారు పోయించుకున్నారట.'

1948 డిసెంబరులో విజయవాడ రేడియో స్టేషనుకు వచ్చారీయన. విజయవాడకొచ్చాక ఈయన తరచు విశ్వనాథను కలుస్తుండేవారు. తరచు రేడియో కవి సమ్మేళనాలకు వాటికీ విశ్వనాథ రావటం ఈయన ఆయన్ని కలుసుకోవటం జరిగేది. రెండుమూడుసార్లు ఇంటికి కూడా వచ్చారు. ఒకసారి మా వారు విశ్వనాథను, రుక్మిణీనాథశాస్త్రిని వెంటబెట్టుకొచ్చారు. ఆరోజు ఆచంట జానకీరాంగారు కూడా ఉన్నారు. మావారు రామాయణం గురించి ఏవో కొన్ని విషయాలు అడిగారు. ముఖ్యంగా మూలానికి దగ్గరగా ఏ రామాయణమున్నది? అన్నదానిమీద చర్చ జరిగింది. ఏదైనా మూలానికి దగ్గరగా ఎందుకుండాలి? మూలాన్ని చదివితే మనకొక భావం కలుగుతుంది. ఆ భావానికనుగుణంగా మనం వ్రాస్తాము అన్నారు విశ్వనాథ. అట్లాగే రాయప్రోలు జడగంటలమీద కూడా చర్చ జరిగింది. రుక్మిణీనాథశాస్త్రిగారు జడగంటలు, జాకెట్లు అని చమత్కారం చేశాడు. ఈ చర్చలన్నీ జరుగుతూ ఉంటే నేను కూడా వింటూ అక్కడే కూర్చున్నాను. ఇంతలో మా పనిమనిషి వచ్చి నన్ను లెమ్మని కాస్త తొందర చేసింది. అది చూసి తమ సంభాషణకు అంతరాయం కలిగించిన ఆ పనిమనిషిని 'మందరవలె వచ్చితివిగదె ' అని విసుక్కున్నారు సత్యనారాయణగారు.

ఇంకొకసారెప్పుడో విశ్వనాథ వచ్చినప్పుడు ఇట్లాగే భారతం మీద చర్చలు సాగాయి. విశ్వనాధ నన్నయ్య గురించి తిక్కన గురించి విమర్శ వ్రాశారుగానీ ఎర్రాప్రగడ గురించి రాయలేదుకదా – నేను ఉండబట్టలేక ఆయనతో 'మీరు ఎర్రాప్రగడకు అన్యాయం చేశారు ' అన్నాను.

అందుకాయన నవ్వుతూ 'ఎర్రాప్రగడకు అన్యాయం చేశానని ఎందుకనుకుంటున్నావు? కావాలంటే ఎర్రాప్రగడను అటునుంచి ఇటుకు అప్పగిస్తాను సరేనా ' అన్నారు.

"విశ్వనాధవారి మనసు మంచిది. అందరూ అనుకున్నట్లు చెడ్డవాడు కాదు" అని ఈయన తరచూ అంటూ ఉండేవాళ్ళు.

మొక్కపాటితో మా పరిచయంకూడా మద్రాసునుండే ప్రారంభం. అప్పుడాయన ఒక రేడియో టాక్‌కు వచ్చి మా ఇంటికి వచ్చాడు. అప్పటినుంచి తరచు వస్తుండేవారు.

జానకిరాం దంపతులతోటి సాన్నిహిత్యం కూడా మద్రాసులోనే పెరిగింది. మేం వాళ్ళింటికి పోవటం, వాళ్ళు మా యింటికి రావటం జరుగుతుండేది.

పింగళి లక్ష్మీకాంతంగారితో పరిచయం విజయవాడలో జరిగింది. బెజవాడ రేడియో స్టేషన్ ప్రొడ్యూసర్‌గా వచ్చి మా యింట్లోనే దిగాడాయన.

*వడ్డెర చండీదాసుగారితో ముఖాముఖి*

27,28–10–1980

నాకు చదివానని గుర్తున్న మొదటి పుస్తకం "చివరకు మిగిలేది". అది చదివాక నేనొక వ్యాసం వ్రాసి తెలుగు విద్యార్థికి పంపించాను. నాకు ఈ మాత్రం తెలిస్తే చాలు అన్న స్థాయిలో వ్రాసిన వ్యాసం అది. విద్యార్థిలో అది ప్రచురితమైంది. విద్యార్థిలో వ్యాసం వచ్చాక ఒకసారెందుకో.... 1956, 57 ప్రాంతాలలో హైదరాబాదులో ఉండగా ఆయనను కలుసుకోవాలనిపించి వాళ్ళింటికి వెళ్ళాను. ఆ తరువాత తరచు వెళ్తుండేవాడిని. సాధారణంగా ఆదివారాలు ఉదయాన్నే వెళ్ళి మధ్యాహ్నమో సాయంకాలమో తిరిగివెళ్ళేవాణ్ణి. ఫిలాసఫీ గురించి, ఫైనార్ట్స్ గురించి ఎక్కువగా మాట్లాడుతుండేవాళ్ళం. లిటరేచర్ గురించి తక్కువే. ఆయనలో 'నాన్ ఇన్‌పార్‌మెంట్ ' కనిపిస్తుంది. వ్యక్తిగా దేన్లోకి దిగడు.

ఆయనకు ఆత్మీయత ఉందిగానీ ఆయనకు దగ్గరకు పోవటం మాత్రం కష్టం. ఆయన ఏ విషయంలోనూ అబద్ధం చెప్పేవాడు కాదు. అది ఎటువంటిదైనా నిజమే చెప్పారు. ఏ విషయంలోనూ పేచీలోకీ వాదనలోకీ దిగరు. చాలా మెతక. కానీ ముఖ్యమైన విషయాలలో ఎంతమాత్రం రాజీకి రారు.

నాకు తెలిసినంతవరకు రేడియోలో ఆయన వాయస్ వినబడలేదు. 80 రూపాయల ఫెలోషిప్‌తో రీసర్చి ప్రారంభించానని ఆయన చెప్పినట్టు గుర్తు.

కొన్ని మౌలికమైన మానవ సమస్యల గురించి పాఠకుడిలో ప్రతిస్పందింప చేయటం చివరకు మిగిలేది నవల ఉద్దేశం. ఆ ప్రతిస్పందింపచేయటంలో ఈస్తటిక్ దృక్పథం ఉంది. సమస్యలకు పరిష్కారం చూపించటం కాక వాటిని అవగాహనకు తీసుకురావటం ఈ నవల ఉద్దేశం. వ్యక్తికి సంబంధించిన అంతరంగిక మానసిక సమస్యలు, సాంఘిక సమస్యలు ఇవి ఇందులో సమస్యలు.

గాఢమైన అటాచ్‌మెంట్ కాంప్లెక్స్‌లో గాఢత ఉండక్కరలేదు. ఉండదుకూడా. ఫిక్సేషన్ ఉంటుంది. ఫిక్సేషనంటే పరిణితి చెందక పోవటం. మనసు ఒక సంఘటనకు ఫిక్స్ అయివుంటుంది. అది మళ్ళీ మళ్ళీ జరుగుతున్నట్లు అనుభూతిలోకి రావటం సైకోఎనాలటికల్ ప్రాసెస్. కొడుకు తల్లితో మాములుగా ఉండటానికి వీల్లేని సంబంధం ఈడిపస్ కాంప్లెక్స్. ఇలాంటి భావం మరొకరెవరితోనూ కలగకూడదు. ఆ దృష్ట్యా దయానిధికున్నది ఈడిపస్ కాంప్లెక్స్ కాదు.

దయానిధి కోమలి విషయంలో పెళ్ళి చేసుకోకుండా సంబంధం ఉంచుకోవటం వ్యభిచారం. పెళ్ళి చేసుకోవటానికి సమాజం తల్లి తండ్రి ఎవరూ అంగీకరించరు. అతను వాళ్ళను ఎదిరించలేదు. అందువల్ల తాను కోమలితో సంబంధాలు పెట్టుకోకుండా విరమించుకున్నాడు.

పెళ్ళి చేసుకోవటంలో ఈ వ్యవస్థలో ఉండాలన్న నిర్ణయం ఉన్నది. కానీ దాన్లో యిమిడే స్వభావం కాదతనిది. అందుకనే అతను తప్పించుకుంటాడు, జారుకుంటాడు.

అమృతం వస్తే అతడు ఆమెను పెళ్ళి చేసుకునేవాడేననిపిస్తుంది. ఆమె చెప్పినదల్లా అతడు లొంగిపోయి కాక యిష్టమై చేస్తాడు. అమృతం కూతురు దయానిధి కూతురు కాదేమోననిపిస్తుంది. నేను లెక్కవేసి చూశాను. ఆమె భర్తకు పుట్టిన కూతురేననిపించింది ఆ పిల్ల. దయానిధి అయిడిలిస్ట్‌గా – ఆ పిల్ల తన కూతురని ఆలోచించాడేమోననిపిస్తుంది.

దయానిధి నుండి కొన్ని కారెక్టర్స్‌ను చూడవచ్చు. చివరకు మిగిలేదిలో ఏ కారక్టరూ ఒక అయిడియాకు ప్రతినిధికాదు. నాన్‌ఈస్తటిక్ అయిడియాకు శ్యామల కారక్టరు ప్రతీక.

నవలలో దయానిధి ఏదనుకుంటున్నాడో బుచ్చిబాబు ఏదంటున్నాడో స్పష్టంగా తెలియదు. ముఖ్యంగా చైతన్యస్రవంతి ధోరణిలో సాగిన పాసెజెస్‌లో ఇది కనిపిస్తుంది. ఇది జాగ్రత్తగా పరిశీలించి కనుక్కోవలసిన విషయం.

మహీధర రామ్మోహనరావుగారితో ముఖాముఖి

5-3-1979

**నాకు** బుచ్చిబాబుతో కొంత పరిచయం ఉంది. చివరకు మిగిలేది వచ్చిన కొద్దిరోజులకే విశాలాంధ్రలో నేనా నవలను రివ్యూ చేశాను. విశాలాంధ్ర మొదలైంది 1952లో. నేనా రివ్యూ వ్రాసింది 1953, 54 ప్రాంతాల్లో అయివుండవచ్చు. సరియైన తారీకు గుర్తులేదు. ఇప్పుడు ఆ పత్రిక కూడా నా దగ్గరలేదు.

జాతీయోద్యమాన్ని గురించి, రాయలసీమలో తెలుగువాళ్ళ తగాదా గురించి అప్పటి ఆ రివ్యూలో ప్రస్తావించాను, సరిగ్గా ఏం రాశానో గుర్తులేదు కానీ జాతీయోద్యమానికి బుచ్చిబాబు ఆ నవలలో వ్యతిరేకతనే చూపించాడని మాత్రం అన్నాను. రాయలసీమలో తెలుగువాళ్ళ తగాదా పూర్తిగా అనవసరం, పొసగనిది అనికూడా వ్రాశాను. 1947 నాటికి రాయలసీమలో అటువంటి తగాదాలు ఉండే వీలులేదు. అది 1967 నాటి తెలంగాణా ఉద్యమానికి సరిపడే స్థితి చిత్రీకరణ చదువుతున్న వాళ్ళు ఎక్కువై నిరుద్యోగ సమస్య పెరిగి సాచురేషన్ ఏర్పడ్డప్పుడు కానీ అటువంటి పరిస్థితి సంభవంకాదు.

వర్కింగ్ క్లాస్‌లో అంత విద్వేషాలేర్పడినట్లు చూపడం కూడా అంత పొసగదలగా లేదు. విప్లవం జరుగుతుండగా వర్కింగ్ క్లాస్ అట్లా చేయలేదు. విప్లవం విఫలమయ్యాకనే అటువంటి ఆలోచనా ధోరణి ఏర్పడుతుంది. రాయలసీమలో అప్పటికి మనవాళ్ళుపోయి స్థిరపడి చూపిస్తున్న అహంభావాన్ని, అధికార దర్పాన్ని మాత్రమే వాళ్ళు ఏవగించుకునే స్థితికాని అది వాళ్ళ ఆస్తులను మొత్తంగా నాశనం చేసేంత పరిణామం ఆనాటి ప్రజలలో వచ్చిన స్థితిలేదు.

నేను వ్రాసిన ఆ సమీక్షను బుచ్చిబాబుకు చదివి వినిపించి ఏమంటావని అడిగాను. నీ అభిప్రాయం నీది అన్నాడాయన.

బుచ్చిబాబు ఎక్కువ మాటకారి కాదు. గంట కూర్చుంటే పదిపదిహేను మాటలు దొర్లితే ఘనమే. తన సాహిత్యం ఎడలగానీ మరే విషయంలోగాని తనకు వ్యతిరేకమైన అభిప్రాయాలు ఎవరైనా చెబితే చిరునవ్వు నవ్వి ఊరుకుంటారుగానీ తన్ను తాను సమర్థించుకునే ప్రయత్నం చేయడు.

సమాప్తం

Post your comments